

తుడా టవర్స్ నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అన్నమయ్య కూడలి వద్ద నిర్మిస్తున్న తుడ టవర్స్ నిర్మాణ పనులను శనివారం తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో టవర్స్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుడ టవర్స్ నిర్మాణ పనులు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణా రెడ్డి, ఈ.ఈ.రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రీశాట్ -1బీ ప్రయోగానికి కౌంట్ డౌన్






ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: దేశ సరిహద్దుల్లో నిఘా సామర్థ్యాన్ని పెంచి, దేశ పటిష్ట భద్రతను పెంచే అత్యాధునిక రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహం రీశాట్ -1బీ ప్రయోగానికి ఇస్రో సన్నద్ధం చేసింది. పి ఎస్ ఎల్ వి-సీ 621 ద్వారా ఈ ఓ ఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహాన్ని కక్ష్యలోకి మోసుకెళ్లనుంది. ఈ ప్రయోగానికి సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సుదీర్ఘ సమీక్ష జరిగింది. జనవరిలో రోదసిలోకి పంపిన ఎన్ వి ఎస్-02 ఉపగ్రహం సాంకేతిక సమస్యలు ఏర్పడి నిర్ణీత కక్ష్యలోకి వెళ్లలేదు. దీని దృష్టిలో ఉంచుకుని పీఎస్ఎల్వి-సి61 ప్రయోగంలో ప్రతి అంశాన్ని శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు.

పి ఎస్ ఎల్ వి -సీ 61 ఉపయోగాలు

రీశాట్ -1బీ ఉపగ్రహంలో అమర్చిన సీ- బ్యాండ్ సింథటిక్



అపార్చర్ రాడార్(సార్) ప్రత్యేకత. ఈ రాడార్ సహాయంతో పగలు, రాత్రి ఎలాంటి వాతావరణ పరిస్థితులైన భూ ఉపరితలాన్ని హై రిజల్యూషన్ తీసి పంపుతుంది. భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పరిస్థితుల విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితులు నెలకొన్న సమయంలో భారత్ సైనిక దళాలకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుంది. దేశభద్రత, సైనిక అవసరాలకు అవసరమైన సమాచారాన్ని అందించడంలో రీశాట్ -1బీ కీలకంగా కానుంది. ఉగ్రవాదుల స్థావరాలు, వారి కదలికలను పసిగట్టడంతో పాటు, సరిహద్దు ప్రాంతాల్లో శత్రువుల బలగాలను సంబంధించిన కార్యకలాపాలను కూడా నిశితంగా పరిశీలించి హై రిజల్యూషన్ ఫోటోలు తీసి పంపుతుంది.

ఉదయం 5.59 గంటలకు ప్రయోగం...

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి ఆదివారం ఉదయం పిఎస్ఎల్వీ సి 61 రాకెట్ ను షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుండి శాస్త్రవేత్తలు నింగిలోకి పంపనున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి శనివారం ఉదయం కౌన్ డౌన్ ప్రక్రియ ప్రారంభమై 22 గంటలు కొనసాగిన అనంతరం ఆదివారం ఉదయం 5.59 గంటలకు పిఎస్ఎల్వీ సి 61 నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి వెళ్ళనున్నది. ఈ పిఎస్ఎల్వి రాకెట్ పొడవు 44.5 మీ.,1996.24 కిలోల బరువు ఉన్న ఈవో ఎస్- 09ను అంతరిక్షంలోని 534 కిలోమీటర్ల దూరంలో ప్రవేశపెట్టేందుకు ఇస్రో ప్రణాళిక వేసింది. 18 నిమిషాలలోపే ఈఓఎస్ 09 నిర్ణీత కక్షలోకి చేరనుంది. ఇందులో నాలుగు సాటిలైట్లు, 6 ఎక్సెల్ బూస్టర్స్ అమర్చి ఉన్నారు. షార్ నుంచి జరుగుతున్న పిఎస్ఎల్వి-సి61 రాకెట్ ప్రయోగానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ ఏడాది షార్ నుంచి 100వ రాకెట్ ప్రయోగించిన ఇస్రో పిఎస్ఎల్వి-సి61 పేరుతో 101వ ప్రయోగానికి సిద్ధమైంది. షార్‌లో రాకెట్ ప్రయోగ వేదిక ఏర్పాటైన తర్వాత త్వరత్వరగా 100ను దాటిన ఇస్రో ఇప్పుడు అత్యంత కీలకమైన మన దేశానికి రక్షణ కల్పించే ఇఓఎస్ 09 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. ఈ ఉపగ్రహానికి పలు ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్.అంటే భూ పరిశీలన ఉపగ్రహం.రీశాట్ 2బిగా కూడా దీన్ని పేర్కొంటున్నారు. రిమోట్ సెన్సింగ్ సేవలు దీని ద్వారా అందుతాయి. ఇది కాకుండా ఇందులో అమర్చిన సింథటిక్ అపెర్చర్ రాడార్ (సార్) పేలోడ్ ప్రత్యేకమైనది. నాసా, ఇస్రో సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహ ప్రయోగం ముందుగా జరగాల్సి ఉంది. ఇందుకోసం జిఎస్ఎల్వి-ఎఫ్16 రాకెట్ సిద్ధమౌతుంది. అయితే ఈ నిసారి ముందే షార్ ప్రయోగం చేపట్టారు. ఇఓఎస్ 09లోని సింథటిక్ అపెర్చర్ రాడార్ విలువైన సేవలను శాస్త్రవేత్తలకు అందించనుంది. పిఎస్ఎల్వి-సి61 రాకెట్ కు సంబంధించి శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్ డౌన్ ప్రారంభించారు. రెండు, నాలుగవ దశల్లో ద్రవ ఇంధనాన్ని ఈ సమయంలోనే నింపుతారు. షార్‌లో రాకెట్ ప్రయోగాన్ని తిలకించేందుకు ఈసారి పార్లమెంటరీ కమిటీలోని 16 మందికి పైగా సభ్యులు విచ్చేయనున్నారు. షార్‌లో మూడు రోజులు ముందు నుంచే పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు మొదలయ్యాయి. సిఐఎస్ఎఫ్ దళాలు సూళ్లూరుపేట, శ్రీహరికోట మార్గంలోను విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సారి సందర్శకుల గ్యాలరీకి అనుమతించకపోవడంతో ఉదయం పూట ప్రయోగం కావడం వలన ఆ అద్భుత ఘట్టాలు చూసేందుకు, చిత్రీకరించేందుకు పులికాట్ సరస్సు ఒడ్డున ఔత్సాహికులు, సందర్శకులు బారులు తీరే అవకాశం ఉంది.

శ్వేత పత్రం ప్రకటించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)కు చెందిన ఆస్తులు, ఆదాయ వివరాలపై శ్వేతపత్రం ప్రకటించాలని సిపిఎం నేత వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వివాదాలకు కేంద్రంగా మారుతున్న తుడా పరిపాలనలో పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, సామాన్య, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చుకోవడానికి, పట్టణ విస్తరణకు తుడ కేంద్రంగా వ్యవహరించాల్సిన తరుణంలో అనేక వివాదాలకు నిలయంగా మారిందని గుర్తు చేశారు. ఇప్పటివరకు తుడా చేతిలో ఉన్న ఆస్తులు వాటి వివరాలు, ఆదాయం కేటాయింపులు గురించిన స్పష్టతను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాగరాజు అన్నారు. తిరుపతి అభివృద్ధితో పాటు, తుడా విస్తరణ జరిగిందని, ఆ మేరకు అభివృద్ధి ఫలాలను ప్రజలకు పంచడంలో బాధ్యతగా వ్యవహరించలేదని ఆరోపించారు. తుడా అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ప్లాట్లు అమ్మేవారికి, కొనేవారికి అనుమతులు ఇచ్చే సంస్థ కాదని, దానికి నిర్దిష్ట లక్ష్యాలు, కార్యాచరణ ఉన్నాయని దురదృష్టవశాత్తు ఆ పనులపై కేంద్రీకరణ ఉండటం లేదన్నారు. పట్టణాభివృద్ధి సంస్థలకు రావలసిన ఆదాయాలను రాష్ట్ర ప్రభుత్వాలు తమ అవసరాలు కనుగుణంగా మళ్లింపులు చేస్తున్నాయని, దీనిని ఆపు చేసి తుడా పరిధిలోని అన్ని రకాల నిర్మాణాలనుంచి ఆదాయం నేరుగా తుడాకు అందేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. అనేక వెంచర్లలో తుడా కొరకు కమ్యూనిటీ అవసరాల కోసం విడిచిపెట్టిన స్థలాలు, పార్కులు నిర్వహణ లేమితో నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని ఆరోపించారు. తుడాలో నెలకొని ఉన్న తాజా పరిస్థితులపై ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి తాజా పరిస్థితులను వివరించాలని నాగరాజు డిమాండ్ చేశారు.

శ్రీవాణి ట్రస్ట్ నిర్వహణపై టిటిడి ఈవో సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీవాణి ట్రస్ట్‌లో ప్రస్తుతం ఉన్న నిబంధనలను పునః సమీక్షించుకుని మరింత మెరుగ్గా ఉండేలా తయారు చేయాలని టిటిడి ఈవో జె.శ్యామల రావు అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్‌లో శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సమరసత సేవా ఫౌండేషన్, దేవాదాయ శాఖ సౌజన్యంతో నిర్మితమవుతున్న ఆలయాల ప్రస్తుత స్థితి, జీర్ణోద్ధరణ పనులు ఏ దశలో ఉన్నాయో నివేదిక తయారు చేయాలన్నారు. పూర్తి అయిన ఆలయాలకు ధూపదీప నైవేద్యాలు, నిర్వహణ అందించేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల నిర్వహణకోసం ప్రత్యేకంగా యంత్రాంగాన్ని రూపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మం, చీఫ్ ఇంజనీర్ టి.వి. సత్యనారాయణ, ఎఫ్ఏసిఏవో ఓ.బాలాజీ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగస్వాములుకండి


పారిశుద్ధ్య కార్మికులకు టోపీలు పంచుతున్న కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర లో అందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. మూడవ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ధ హీట్ నినాదంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎండ తీవ్రతలను తగ్గించేలా మొక్కలు నాటడం, చలివేంద్రాలు ఏర్పాటు, పశు పక్ష్యాదుల కొరకు నీటి తొట్టెల ఏర్పాటు, పారిశుద్ధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టోపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్, కార్పొరేటర్లు అన్నా అనిత, రేవతి, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పుర' యాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరపాలక సంస్థకు సంబంధించిన సౌకర్యాలు ఉండే 'పుర' యాప్‌ను కమిషనర్ మౌర్య శనివారం ఆవిష్కరించారు. ఈ యాప్‌లో ఉన్న వివిధ సేవలు, సౌకర్యాలు నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్ రవి, సేతు మాధవ్‌లు ఉన్నారు.

సైనికులకు సంఘీభావం



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: ఆపరేషన్ సింధూర్ విజయానికి సంఘీభావంగా శ్రీకాళహస్తిలో కూటమి నేతలు, ప్రజా సంఘాలు, విద్యార్థి నాయకులు శనివారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నేతృత్వంలో జాతీయ జెండాలు చేతబట్టి పట్టణ నాలుగు మాడ వీధుల్లో భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ చేపట్టారు.

సీఎంను కలిసిన సుగుణమ్మ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి టిడిపి మాజీ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ అండ్ బ్యూటీ ఫికేషన్ చైర్మన్‌గా సుగుణమ్మకు పదవి ఇవ్వడంతో ఆమె శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల సంతోషంగా ఉందన్నారు.

డాలర్స్ తోనే తుడా చైర్మన్ పదవికి వన్నె




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: డాలర్స్ దివాకర్ రెడ్డి నియామకంతో తుడా చైర్మన్ పదవికి వన్నె వచ్చిందని శ్రీకాళహస్తి టీడీపీ సీనియర్ నేత కన్నలి ప్రతాప్ రెడ్డి అన్నారు. తుడా చైర్మన్‌గా దివాకర్ రెడ్డి నియమితులవ్వడం పట్ల కన్నలి ప్రతాప్ రెడ్డి సోదరులు శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం తిరుపతిలో దివాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలమాలతో సత్కరించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నమ్మకానికి తగ్గట్లుగా తుడాను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్నలి ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలలో భారీ వర్షం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో శనివారం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురుసింది. దట్టంగా కమ్ముకున్న మేఘాలు బలంగా వీస్తున్న ఈదురు గాలులతో రెండు గంటలపాటు భక్తులు ఇబ్బందులు పడ్డారు. గాలుల తీవ్రత దృష్ట్యా భక్తులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని టీటీడీ అధికారులు సూచనలు చేస్తున్నారు. టిటిడి సిబ్బంది ఘాట్ రోడ్డులో జాగ్రత్తగా ప్రయాణించాలని వాహనదారులను హెచ్చరిస్తున్నారు

ఐఫోన్‌లోనూ ఎపిఎస్పిడిసిఎల్ మొబైల్ యాప్


ఎపిఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోష రావు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఐఫోన్ వినియోగదారుల కోసం ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చి నట్లు ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఆండ్రాయిడ్ మొబైల్స్ లో మాత్రమే ఎపిఎస్పిడిసిఎల్ మొబైల్ యాప్ వినియోగదారులకు అందుబాటులో వుండేదన్నారు. అయితే యాపిల్ ఐఫోన్ వినియోగదారులకు కూడా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంస్థ ఐటి విభాగం ఆధ్వర్యంలో యాపిల్ ఐఓఎస్ మొబైల్ యాప్ రూపొందించామని వివరించారు.

ఇళ్ల మధ్య మద్యం షాపుపై విచారణ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి రూరల్, సాయి నగర్ పంచాయతీ, జయనగర్‌లో నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ గత మూడు నెలలుగా స్థానిక ప్రజలు ఉద్యమిస్తున్న విషయం విదితమే. ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సాయి నగర్ సర్పంచ్ డివి రమణ ఆధ్వర్యంలో సీఎం, డిప్యూటీ సిఎంలకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ప్రభుత్వం, చిత్తూరు ఎక్సైజ్ అధికారి సుబ్రమణ్యంను విచారణ అధికారిగా నియమించారు. శనివారం ఆయన జయనగర్ లోని మద్యం దుకాణం వద్దకు చేరుకొని స్థానికులతో, మద్యం దుకాణ యాజమాన్యంతో చర్చించారు. ఈ సందర్భంగా సాయి నగర్ సర్పంచి డివి రమణ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు, విచారణ అధికారికి మద్యం షాపు తొలగించాలని విన్నవించారు. స్థానికంగా గుడి, బడి ఉందని, ఈఎస్ఐ ఆసుపత్రి మహిళల హాస్టల్, నివాస గృహాలు ఉన్నాయని సర్పంచ్ డివి రమణ తెలిపారు. ఓటేరు, అవిలాల, సాయి నగర్, లింగేశ్వర నగర్‌లకు చెందిన విద్యార్థులు, మహిళలు ఈ మార్గంలోనే నిత్యం వెళుతుంటారని తెలిపారు. మద్యం దుకాణాన్ని తొలగించని పక్షంలో సాయి నగర్, ఓటేరు, లింగేశ్వర్ నగర్, అవిలాల సర్పంచులు, స్థానిక మహిళలతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. తిరుపతి రూరల్ మండలానికి కల్లుగీత కార్మికుల కోసం కేటాయించిన ఈ మద్యం దుకాణాన్ని మండలంలో మరెక్కడైనా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. నివాసాల మధ్య వద్దని డిమాండ్ చేశారు. ఆకతాయిలు మద్యం సేవించి మహిళలపై అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని మహిళలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, లింగేశ్వర్ నగర్ సర్పంచ్ కోటేశ్వరరావు, రిటైర్డ్ బ్యాంక్ అధికారి జయరాం నాయక్, ప్రతాప్ రెడ్డి, అమాస పరమేశ్వరి, సిఎస్ రమణ, శ్రీనివాసులు, జయముని, దస్తగిరి, గీత, జయమ్మ, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో దారుణం

■ దళిత విద్యార్థి జేమ్స్ కిడ్నాప్, ఆపై హత్యాయత్నం


చికిత్స పొందుతున్న జేమ్స్(ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి నగరంలో దళిత విద్యార్థిని ఓ రౌడీ షీటర్ కిడ్నాప్ చేసి, ఆపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు జేమ్స్ తిరుపతి సమీపంలోని విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజీలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. నగరంలో రౌడీ షీటర్లుగా ఉన్న సాయి రూపేష్, చోటా బ్లేడు గ్యాంగ్, జేమ్స్‌ను కులం పేరుతో దూషించేవారు. కాలేజీకి వెళ్లే ప్రతిసారి ఒరేయ్ తక్కువ జాతి నా కొడకా అంటూ హేళన చేసేవారు. దీన్ని ప్రశ్నించినందుకు రెండు రోజుల క్రితం జేమ్స్‌ను కిడ్నాప్ చేసి, నోట్లో మూత్రం పోసి ఒకటిన్నర రోజు పాటు చిత్రహింసలు పెట్టారు. ఆపై చంపేందుకు ప్రయత్నించారు. ఎలాగోలా వారినుంచి తప్పించుకున్న జేమ్స్ రుయా హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతున్నాడు. తనను కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడి, చిత్రహింసలకు గురి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుచానూరు పోలీసులు సంబంధిత రౌడీషీటర్ అండ్ గ్యాంగ్‌పై నామమాత్రపు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. నాకు న్యాయం జరగాలి, లేదంటే ఆత్మహత్య శరణ్యం అంటూ బాధిత దళిత విద్యార్థి జేమ్స్ వైద్యుల ముందు కన్నీరు పెట్టాడు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బాధితుడికి న్యాయం చేయాలని పలు ప్రజాసంఘాలు, దళిత సంఘాలు కోరుతున్నాయి.

ప్రజాదృష్టి

'అధికార' జాతర



తిరుపతి గంగమ్మ జాతర రాయలసీమలోనే ప్రసిద్ధిగాంచిన పండుగ. వారం రోజులు జాతరల్లో భక్తులు రకరకాల వేషదారణలతో ఆడుతూ పాడుతూ మొక్కులు చెల్లించుకుని, చివరి రోజు విశ్వరూప దర్శనానికి లక్షలాది మంది తరలివచ్చి, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది అధికార కూటమి ప్రభుత్వం జాతరను కూడా రాజకీయాలకు నెలవుగా మార్చేసి, సామాన్యులను విశ్వరూపాన్ని వీక్షించేందుకు పెద్దగా అవకాశాలు ఇవ్వకపోగా, సంప్రదాయాలు తుంగలోతొక్కి అధికారులు ఆజమాయిషిలు, అధికార పార్టీ నాయకులు పెత్తనంతో జాతర నిర్వహణ విమర్శలపాలైంది.

- ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర రాయలసీమలోనే అతి పెద్ద జాతర. ఒక ముక్కలో చెప్పాలంటే తెలుగురాష్ట్రాల్లో సమ్మక్క సారక్క జాతర తర్వాత రెండోవ పెద్ద జాతర ఇదే. తిరుపతికి సమీపంలోని అవిలాలలో జన్మించిన గంగమ్మ, పాలెగాళ్ల పాలనలో ఉన్న తిరుపతిలోని యువతుల శీలాలకు భద్రత లేకుండా పోయిందని, యువతులను కాపాడేందుకు గంగమ్మ దుష్టశిక్షణ కోసం తిరుపతిలో వెలసిందని ప్రతీతి. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మతో పాటు తాళ్లపాక గంగమ్మ, వేశాలమ్మ, అంకాలమ్మ, మారెమ్మ, ముత్యాలమ్మ, విరుపాక్షమ్మ దేవాలయాల్లో కూడా జాతర నిర్వహిస్తారు. తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామికి స్వయాన చెల్లిగా చెప్పబడుతున్న తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకునేందుకు జాతర రోజుల్లో నిత్యం వేలాది మంది వివిధ రకాల వేషదారణలతో వస్తుంటారు. మంగళవారం జాతర రోజు అర్ధరాత్రి గంగమ్మ విశ్వరూపాన్ని విశ్వబ్రాహ్మణులు తయారు చేస్తారు. అమ్మవారి విశ్వరూపాన్ని చూసేందుకు రాయలసీమ వ్యాప్తంగా సుమారు లక్షన్నర మందికి పైగా వస్తుంటారు. వేకువ జామున గంగమ్మకు సోదరి వరసైన పేరంటాలమ్మ వేషదారణలో కైకాల వంశీకులు వచ్చి గంగమ్మ చెంప నరుకుతారు. అనంతరం మట్టితో తయారు చేసిన అమ్మవారి ప్రతిమను తొలగిస్తారు. ఆ మట్టి కోసం భక్తులు ఎగబడుతారు. ఇది జాతర్లో చివరి తంతు. ఏడాదికి ఏడాదికి జాతర ప్రాముఖ్యతను తెలియజేస్తే విస్తృతంగా ప్రచారం చేస్తూ, మరింత వేడుకగా చేసేందుకు ప్రతి ఏడాది అధికార యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటి కృషి చేస్తుంది.

గత మూడు సంవత్సరాలుగా నగరంలో వీధి వీదిన అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి, నగరం పురవీధుల్లో మామిడి తోరణాలు, అరిటిమాన్లు, వేపాకు తోరణాలు కట్టి, సారెలు పంపుతూ జాతరలో అందరూ పాలుపంచునేలా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహిస్తున్న మొదటి జాతర అలకలు, అరుపులు, అవమానాలకు వేదికగా మారింది. అంతేకాక జాతర సాంప్రదాయాననికి తూట్లు పొడిచి, అధికారులు, అధికార పార్టీ నాయకులు కన్నుసన్నల్లో ఆలయ పరిసరాలను ఉంచుకుని, సామాన్యులకు కనీసం విశ్వరూప దర్శనానికి కూడా పెద్దగా అవకాశం ఇవ్వలేదని విమర్శలు వచ్చాయి. ఆఖరికి జాతర చివరిఘట్టమైన పేరంటాల రాక సందర్భంగా ఆలయ గేటు తాళాలు వేసి, అవి ఎక్కడ, ఎవ్వరి దగ్గర ఉన్నాయా కూడా తెలియకుండా చేసి, అమెను ఆలయంలోకి రానీయకుండా అడ్డుకోవడంతో ఆ ఘటన అవమానకరంగా బావించిన ఆమె అక్కడ నుంచి తిరిగి వెళ్లిపోయింది. విశ్వబ్రాహ్మణులే ప్రతిమ మట్టిని తొలగించేలా చేశారని భక్తులు బహిరంగంగా విమర్శించారు. ఆలయం వద్ద జాతర రోజుల్లో అమ్మవారి నినాదాలకంటే అధికార పార్టీ నాయకుల జేజేల హోరెత్తించాయి. ఆలయానికి పూర్తిస్థాయి కమిటీ లేకపోవడం. తాత్కాలిక కమిటీ కూడా నామమాత్రంగా వ్యవహరించేలా, కనీసం వారి మాటకు విలువ లేకుండా చేశారన్నది ఆలయ సిబ్బంది మాట. వాస్తవానికి జాతరకు బారీ బందోబస్తు ఏర్పాటు చేయడం మామూలే. కానీ ఈ సారి గతంలో వైకుంఠ ఏకాదశి రోజు జరిగిన తొక్కిసలాటని బూచిగా చూపి పోలీసు అధికారులు ఆలయం మొత్తం తమ గుప్పెట్లోకి తీసుకున్నారు. పైగా కార్పొరేషన్ కమిషనర్ నిత్యం పర్యవేక్షణ పేరుతో జాతర నాడు కూడా అక్కడే తిష్టవేయడం, కార్పొరేషన్ పాలకమండలి, ఎంఎల్ఏ, అధికార యంత్రంగం అక్కడే ఉండిపోవడం జరిగింది. వివిఐపి క్యూలైన్ల పేరుతో బారీ క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో, సామాన్యులు కనీసం అమ్మవారికి పొంగళ్లు అర్పించేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. మంగళవారం వేకువ జామునుంచే సుమారు 40వేల మందికి పైగా కుటుంబాలు పొంగళ్లు పెట్టేందుకు, యాటలు, కోళ్లు బలిఇచ్చేందుకు వస్తుంటారు. ఆలయ ప్రాంగణంలో సామాన్యులు కనీసం 1500 మంది కూడా ఉండలేని విధంగా క్యూలైన్లు ఏర్పాటు చేయండతో పొంగళ్లు అర్పించేదుందుకు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఇంట్లిపాది మొక్కులు చెల్లించుకోవాల్సి ఉండగా ఒకర్ని మాత్రమే అనుమతించేలా వ్యవహరించడంతో చాలా కుటుంబాలు ఒకరికొక్కరు ఎక్కడున్నారో కూడా అర్థంగాని గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం ఉదయం పొంగళ్ల నుంచి బుధవారం ఉదయం విశ్వరూప దర్శనం వరకు మొత్తం అధికారులు, అధికార పార్టీ నాయకులు కన్నుసన్నల్లో ఉండడంతో సామాన్యులకు నిరాశ తప్పలేదు. పైగా జాతరల్లో సాంప్రదాయాలను సైతం పక్కన పెట్టారని విమర్శలు వినిపించాయి. ఇందుకు ప్రధాన కారణం ప్రధాన నాయకుడు స్థానికేతరుడు కావడం, కలెక్టర్, ఎస్పి, కార్పొరేషన్ కమిషనర్ కూడా స్థానికేతరులు కావడంతో పాటు పూర్తిస్థాయిలో ఆలయానికి పాలకమండలి లేకపోవడం పెద్ద లోపంగా స్థానికులు పేర్కొంటున్నారు.

ఏది ఏమైనా ఆనందోత్సాహల మధ్య, విచిత్ర వేషదారణలతో కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకునే భక్తులు, ఈ ఏడాది నిరాశగానే ఉన్నారని, తూతూ మంత్రంగా జాతర జరిపించారని భక్తులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. రాబోవు రోజుల్లో అయినా జరిగిన తప్పిదాలను సరిచేసూకుని, జాతరలో సామాన్యులకు పెద్ద పీఠ వేసి, మరింత వేడుకగా తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర నిర్వహించి, భక్తుల మన్నలను పొందుతారని ఆశిద్దాం.

దేశ సైనికులకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా నిర్వహించిన భారత సైనికులకు మద్దతుగా పుత్తూరులో స్థానిక ఎంఎస్ ఎం. పెట్రోల్ బంక్ నుంచి, అంబేద్కర్ సర్కిల్ వరకు శనివారం, ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు విద్యార్థులు, మాజీ ఆర్మీ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అమరవీరులకు జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ దనపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, టిడిపి నాయకులు డిఎస్ ఎలుమలై, అమ్ములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) భారత దేశ రక్షణ కోసం సైనికులు, వీర జవాన్లు చేస్తున్న పోరాటం అద్భుతమని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. శనివారం చంద్రగిరిలో భారత సైన్యానికి సంఘీభావం తెలియజేస్తూ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో కూటమి నాయకులు, మాజీ సైనికులు, ముస్లిం మైనార్టీలు, సామాజిక కార్యకర్తలు, పారిశ్రామికవేత్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. అమరులైన వీర జవాన్లకు ఎమ్మెల్యే పులివర్తి నాని, కూటమి పార్టీల నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. చంద్రగిరి నాగాలమ్మ గుడి వద్ద నుండి టవర్ క్లాక్ వరకు జాతీయ జెండాను ఊరేగింపుగా చేపట్టారు. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మేకల తిరుమలరెడ్డి, ఏ ఈశ్వర్ రెడ్డి, బెల్లంకొండ మురళి పాల్గొన్నారు.

కావ్య యాదవ్ మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లికి చెందిన కావ్య యాదవ్ (23) అను మహిళ, శనివారం పాముకాటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చర్లపల్లి గ్రామానికి వెళ్లి మృతి దేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, టిడిపి నాయకులు ఆనంగి రమేష్, టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి ట్రామా కేర్ సెంటర్, హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత డయాబెటిక్ ఫుట్ కేర్ క్లినిక్‌కు విశేష స్పందన లభించింది. స్థానిక కృష్ణ హోటల్ ఎదురుగా విశ్వనాథ నగర్‌లోని హాస్పిటల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఉద్దేశించి ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సురేఖ వెల్లాల మాట్లాడుతూ ప్రతి శనివారం ఉచిత డయాబెటిక్ ఫుట్ కేర్ క్లినిక్ నిర్వహిస్తున్నామన్నారు. డయాబెటిక్ ఉన్నవాళ్లు వాళ్ల పాదాల సమస్యలపై అశ్రద్ధ చేయకుండా, తరచూ వచ్చే సమస్యలపై వైద్యుల సలహాలు పాటించాలన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులు కాళ్లలో ఆనెలు ఏర్పడితే మొదటి, రెండో దశలోనే దాన్ని గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ దుర్గాప్రసాద్, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

సహస్ర హాస్పిటల్‌లో బీపీపై ఉచిత వైద్య శిబిరం



పరీక్ష చేస్తున్న సహస్ర హాస్పిటల్ ఎండి డాక్టర్ వూకా శబరీష్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం రవాణా శాఖ కూడలిలోని సహస్ర హాస్పిటల్‌లో ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు (ఈ నెల 23 వరకు) బీపీ పేషెంట్లకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని హాస్పి టల్ ఎండి డాక్టర్ వూకా శబరిష్ తెలిపారు. హిమోగ్లోబిన్, టీఎస్‌హెచ్, ఆర్‌బిఎస్ పరీక్షలకు ఎటువంటి రుసుము ఇవ్వన వసరం లేదన్నారు. హైపర్ టెన్షన్ స్క్రీన్ ప్యాకేజ్ లిపిడ్ ప్రొఫైల్, సియుఈ, ఈసీజీ క్రిటినైన్ కోసం రూ.450 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సహస్ర హాస్పిటల్ ప్రారంభం నుండి పేద మధ్యతరగతి ప్రజల్లో ఉన్న ఆరోగ్య రుగ్మతలు దూరం చేయడానికి నాణ్యమైన వైద్యాన్ని అతి తక్కువ ఫీజులతో అందివ్వడం జరుగుతుందన్నారు. వారం రోజుల ఈ హైపర్టెన్షన్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

వారాహి జ్యువెలర్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న హోటల్ కెన్సస్‌లో శనివారం వారాహి జ్యువెలర్స్ ఎగ్జిబిషన్‌ను తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వారాహి జ్యువలరీ బంగారం, డైమండ్, కుందన్ అభరణాలు అమ్మకాలు, ప్రదర్శన రెండు రోజుల (17,18) శనివారం, ఆదివారం నిర్వహిస్తున్నారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటుచేసిన ఆభరణాలు మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటాయని తెలిపారు. వారాహి జ్యువలరీ నిర్వాహకులు మాట్లాడుతూ బ్రాండెడ్‌తో చిన్న కలెక్షన్ నుంచి పెద్ద కలెక్షన్ వరకు అందుబాటులో ఉన్నాయని, బంగారం ధరపై 150 రూపాయలు తగ్గింపు ఇస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీషతో పాటు మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ కరణం, మేనేజర్ అనిత రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ లిహారి, నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వెంచర్ కోసం మా భూమిని ఆక్రమించారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రభుత్వ భూమిని కలుపుకొని ప్రైవేటు వెంచర్ ఏర్పాటు చేసిన వారు తమ స్వాధీన అనుభవంలో ఉన్న భూమిని కూడా ఆక్రమించి తమ వెంచర్‌కు రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారని రేణిగుంట మండలం, కృష్ణాపురం గ్రామపంచాయతీకి చెందిన నాగముంతల రవి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రేణిగుంట పోలీస్ స్టేషన్ సిఐగా విధులు నిర్వర్తించిన అంజు యాదవ్ భర్త గంగాధరం, ఆమె తమ్ముడు అంజి అనే వ్యక్తులు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ తమ పిత్రార్జితంగా సంక్రమించిన కృష్ణాపురం గ్రామ లెక్క దాఖల సర్వేనెంబర్ 308/8లో ఉన్న మూడు ఎకరాల 30 సెంట్లు భూమిలో ఎకరం స్థలంలో రోడ్డు మార్గాన్ని దౌర్జన్యంగా ఏర్పాటు చేశారన్నారు. తమ భూమికి సంబంధించి రికార్డుల్లో ఉన్న వాటిని కూడా వారు చెరిపేసారని అన్నారు. దీనిపై ప్రశ్నిస్తే తమపై అక్రమ కేసులు పెడతామని భయాందోళనకు గురి చేస్తున్నారని, ఈ సమస్యను పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఇప్పటికీ ఐదు సార్లు అర్జీలు ఇచ్చిన ఫలితం లేకుండా పోయిందని, ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్ వేస్తూ నిబంధనలకు విరుద్ధంగా హై టెన్షన్ కరెంటు స్తంభాల కిందనే రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయడంతో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ వారు కూడా ఈ వెంచరుకు అప్రూవల్ ఇవ్వలేదని, జిల్లా కలెక్టర్ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ సమస్య పరిష్కారం కాకపోతే సీఎంను కలవడానికి తాను సిద్ధమని ప్రకటించారు.

పిజిఆర్ఎస్‌లో ప్రజల సౌకర్యార్థం..

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రజల కోసం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చినవారు తమ అర్జీల స్థితిగతులను అర్జీ నెంబర్‌తో గాని, ఆధార్ నెంబర్‌తో గానీ, మొబైల్ నెంబర్‌తో గాని ఏదేని సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకోవడానికి, కొత్త ఫిర్యాదులు కూడా నమోదు చేసుకోవడానికి 1100 కాల్ సెంటర్‌కు ఫోను ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. యధావిధిగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పిజిఆర్ఎస్ కార్యక్రమం కొనసాగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

పర్యావరణ పరిశుభ్రతే లక్ష్యం

వాడ వాడలా స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర



పక్షులకోసం నీరు పెడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, కలెక్టర్

ప్రజాశక్తి - నాయుడుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో మునిసిపల్ కమిషనర్ ఎస్వీ జనార్ధన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు ఎలాంటి లోటు కనబడనీయకుండా ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం పట్టణ సమీపంలోని గోమతి సెంటర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. గాంధీ మున్సిపల్ పార్కులో పక్షులు సంరక్షణ కోసం చిరు ధాన్యాలు, త్రాగు నీటిని ఏర్పాటుచేశారు. అలాగే పార్కు ముందు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి యువ నాయకులు నెలవల రాజేష్, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ కటకం దీపిక, మునిసిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, దార్ల రాజేంద్ర పలువురు టిడిపి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో ఏఆర్ డిఎస్పి రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పోలీసు గ్రౌండ్‌లో సిబ్బందితో కలిసి పర్యావరణ, పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు.

పక్షుల కోసం నీరు.. వేసవిలో పక్షులు మంచినీటి కోసం, ఆహారం కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు, జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు సూచన మేరకు పోలీస్ గ్రౌండ్ పక్షులకు మంచినీరు ఏర్పాటు చేశారు. అక్కడక్కడ చిన్న మట్టి పాత్రలో మంచి నీటితో పాటు, కొన్ని ఆహార పదార్థాలను పోలీసులు ఏర్పాటు చేశారు. ఇదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో పక్షుల కోసం ఇలాంటి ఏర్పాట్లు చేసినట్లు ఎస్పి వెల్లడించారు.

ప్రతి ఒక్కరు చెట్లు నాటాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భూతాపాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా చెట్లు నాటాలని డాక్టర్ రవి రాజు సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం బీట్ ది హీట్ అనే కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాసులు, బాబురావు, ఎన్‌సిసి అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా చేసుకుందాం, చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్ తెలిపారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చెట్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్మన్, కమిషనర్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏఈలు, వార్డ్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్ర దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించి, శుభ్రత పరిశుభ్రత గురించి యంపిడివో అవగాహన కల్పించారు.

ఎపిఎస్‌పిడిసిఎల్‌లో పరిసరాల పరిశుభ్రం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్‌పిడిసిఎల్) కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్) పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, పిహెచ్ జానకిరామ్, ఎన్. శోభా వాలెంటీనా, కె.ఆర్. ఎస్. ధర్మజ్ఞాని, జాయింట్ సెక్రటరీ ఎం. గోపాలకృష్ణ, జనరల్ మేనేజర్లు సి. ప్రసాద్, సురేంద్ర రావు, మురళి, రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గుర్తు తెలియని మృత దేహం లభ్యం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రైల్వే స్టేషన్ పడమర వైపు నార్త్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైన సంఘటన చోటుచేసుకుంది. గూడూరు రైల్వే పట్ట ణ సిఐ శ్రీనివాస్ వివరాల మేరకు మృతుడి వయస్సు సుమారు 70 సంవత్సరాలు ఉంటాయన్నారు. మృతుడు గత కొంత కాలంగా గూడూరు రైల్వే స్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని, అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడని స్థానికులు తెలియజేశారన్నారు. మృతుని కుడి చేతిపై జయలక్ష్మి అని పచ్చ బొట్టు ఉందన్నారు. పసుపు రంగు చొక్కా, కాషాయ రంగు పంచె ధరించి ఉన్నాడన్నారు. మృతుని వద్ద ఎటువంటి వివరాలు లభించలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఈ నంబర్లను 91002 44099, 9440796343 సంప్రదించాలని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంటిలో చోరీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రిటైర్డ్ ఉద్యోగి పుల్లారెడ్డి ఇంటిలో శుక్రవారం చోరీ జరిగింది. ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణ నగర్‌లో నివాసం ఉన్న ఆయన, కుటుంబ సమేతంగా ఈనెల 4న బెంగళూరుకు వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చి సరికి ఇంటి తాళాలు తెరిచి ఉన్నాయి. అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగినట్లు గుర్తించి, వేలు ముద్రలు ఇతర ఆధారాలను సేకరించారు. ఈ చోరీలో 150 గ్రాముల బంగారం, 3 కేజీల వెండి, ఓ టీవీ, 250 డాలర్ల కరెన్సీ, మిక్సి, పట్టుచీరలు, ఇంటి సరుకులు అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20న జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డి.ఆర్.డబ్ల్యు కళాశాలలో ఈనెల 20వ తేదీన దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల, లక్ష్య ఫౌండేషన్ సంయుక్తంగా ప్రముఖ పరిశ్రమల ద్వారా 500 మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు తెలియజేశారు.

గంధమహోత్సవ గోడ పత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, హజరత్ సయ్యద్ హోషిం హుస్సేని ఔలియా వారి గంధమహొాత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం దర్గా ఆవరణంలో దర్గా కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులతో కలిసి గోడ పత్రికల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉర్దూ నెల బక్రీద్ మాసంలో హజ్రత్ సయ్యద్ హోషిమ్ హుస్సేనీ ఔలియా వారి గందమహొాత్సవం జరుగుతుందని తెలిపారు. 28వ తేదీ నిషాన్ జెండా కార్యక్రమం, 31వ తేదీ చందన సేవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జూన్ రెండో తేదీ సోమవారం గంధమహోత్సవం జరగనుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు మొహమ్మద్ మగ్దూమ్, షేక్ షానవాజ్,మెహమ్మద్ అన్వర్, యస్దాని, షేక్ షబ్బీర్, సైదు, గోల్డెన్ గౌస్, షాకీర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

మా భూములను ఫ్రీ హోల్డ్‌లో చేర్చండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తమ భూములు ఫ్రీ హోల్డ్‌లో చేర్చాలని తిరువెంగళాయపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. గామస్తులు శనివారం మీడియాతో మాట్లాడుతూ గూడూరు మండల పరిధిలోని కొమ్మనేటురూ రెవెన్యూ గ్రామ పరిధిలోని తిరువెంగళాయ పల్లికి చెందిన ఎస్సీ, బీసీలకు కలిపి 1984 వ సంవత్సరంలో సర్వే నంబర్ల 246, 340, 341, 342, 343, 344, 345, 346 లలో 0.75 సెంట్లు చొప్పున అధికారులు డి. పారం పట్టాలను మంజూరు చేశారన్నారు. ఆ భూములను ఇంత వరకు సబ్ డివిజన్ చేయలేదన్నారు. వర్షాధార పంటలు వేసుకొని జీవనం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం 20 సంవత్సరాలు పూర్తి అయిన ఫ్రీ హోల్డ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రికార్డులో ఉన్న పేర్లను పరిశీలించి సబ్ డివిజన్ చేసి ఫ్రీ హోల్డ్‌కు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్, చలపతి, వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): చౌక దుకాణాల ద్వారా నిత్యవసర సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. చంద్రగిరి మండలంలోని రేషన్ డీలర్లతో ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లై డిప్యూటీ తాహశీల్దార్ నిర్లక్ష్యం కారణంగా రేషన్ డీలర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశానికి హాజరు కాని రేషన్ డీలర్లను మార్చాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు రేషన్ అందించే విషయంలో రాజీపడేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు శివరామ సుబ్బయ్య, మండల పార్టీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, చంద్రగిరి మార్కెటింగ్ కమిటీ అధ్యక్షుడు గౌస్ బాషా టిడిపి నాయకులు ప్రవీణ్, వినోద్, సివిల్ సప్లైస్ డీటి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం రోడ్డు మరమ్మతు చేయండి

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలంలోని వెంకటాపురం గ్రామానికి వెళ్ళు రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని రాష్ట్ర ఓబిసి యువసేన సంఘర్షణ సమితి అధ్యక్షుడు పూల వెంకటాద్రి శనివారం ఎంపీడీవో విష్ణు చిరంజీవికి వినతి పత్రం సమర్పించారు. ఎందరో నాయకులు వస్తున్నారు అధికారులు వెళ్తున్నారు, అయినా ఈ రోడ్డు గురించి పట్టించుకునే నాయకుడే కరువయ్యారని ఆయన విమర్శించారు. నిత్యం గ్రామస్తులు, విద్యార్థులు ద్విచక్ర వాహనాల దారులు ప్రయాణిస్తూ ఉంటారని, అప్పుడప్పుడు ఇక్కడ రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని, కాబట్టి వెంటనే రోడ్డు మరమ్మత్తు చేయాలని ఆయన కోరారు.

ప్రపంచ వస్తు ప్రదర్శనశాలల దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రపంచ వస్తుప్రదర్శన శాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల (ఎ), టీటీడీ, తిరుపతిలోని చరిత్ర విభాగం "వేగంగా మారుతున్న సమాజాలలో మ్యూజియంల భవిష్యత్తు" అనే సమయోచితమైన, కీలకమైన అంశంపై ప్రత్యేక ఆన్‌లైన్ ఉపన్యాసాన్ని నిర్వహించింది. ఈ ఆన్‌లైన్ ఉపన్యాసం వేగంగా మారుతున్న ప్రపంచంలో మ్యూజియంల భవిష్యత్తును రూపొందిస్తున్న సవాళ్లు మరియు వినూత్న విధానాలపై లోతుగా చర్చించింది.

సంక్షేమ ఫలాలు అందేలా చూడండి

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: మండలంలో ఇల్లు లేని పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కోరారు. శనివారం ఎమ్మెల్యే తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ఈ మేరకు వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. అలాగే బీసీ బాలికల హాస్టల్‌ను త్వరగా ప్రారంభించాలని, తుడా నిధులతో ఎం.ఐ.జి లే అవుట్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. స్పందించిన జాయింట్‌కలెక్టర్ పరిశీలిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రపంచ రక్తపోటు దినోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో "ప్రపంచ రక్తపోటు దినోత్సవంను స్విమ్స్ ఓ.పి.డి. బ్లాక్‌లో శనివారం నిర్వహించారు. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో కార్డియాలజి సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వనజాక్షమ్మ మాట్లాడుతూ అధిక రక్తపోటును కంట్రోల్ వుంచుకోవడానికి ప్రతి రోజు యోగా, ధ్యానం లాంటివి చేసుకుంటూ, మనసును ప్రశాంతంగా వుంచుకోవాలన్నారు. కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరీష్ చౌదరి మాట్లాడుతూ బీపీని కంట్రోల్ ఉంచుకోవడం వల్ల స్ట్రోక్, పక్షవాతం లాంటివి తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ రక్తపోటు నార్మల్గా వుందా లేదా అనేది చెక్ చేసుకుంటూ వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజీ విభాగపు వైద్యులు, పేషంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



ప్రజాశక్తి - నాయుడుపేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నాయుడుపేట పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం వద్ద ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాసులు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి.వరప్రసాద్ రెడ్డి, నాయుడుపేట పట్టణ, రూరల్ ఏఇలు శివశంకర్, హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం: దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తహసిల్దార్ వెంకటరమణ తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రామచంద్రాపురం, సి.రామాపురం, తహసిల్దార్ కార్యాలయల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడులో అంబేద్కర్ విగ్రహం దగ్గర శరవనన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్యవేడు సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి నాయుడు హాజరై ఆయన చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి, ఈఎస్ఐ ఆసుపత్రి ఆవరణలో రోగులు, పాదచారుల కోసం శనివారం ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వి.ఆర్.ఎస్. కాంటీన్, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ తోడ్పాటుతో ఆసుపత్రి ప్రధాన రహదారి ఎదుట మూగ జీవాల దాహార్తి కోసం నీటి తోట్టెను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఆర్ఎంఓ. డాక్టర్. చల్లా సునీల్ కుమార్, డాక్టర్. జి. శివ మహేశ్వర, నర్సింగ్ అధికారిణులు సి. అమ్ములు, డి. విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి పరిధిలోనీ ఆపరేషన్ ఎస్ఎస్లో 33/11 కె.వి. ఆర్.డిఓ, సిఎమ్డి సబ్ స్టేషన్ లో గల అన్ని ఫీడర్లు నిర్వహణకు 18న ఆదివారం ఉదయం 7:00 నుండి మధ్యాహ్నం 01.00 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపిఎస్పిడి సీయాల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈఈ విన్నకోటి చంద్ర శేఖర్ రావ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఏమ్ కె నాయుడు కాలని, శ్రీనివాస పురం, ఏమ్ ఆర్ పల్లి, ఆర్.డి.ఓ ఆఫీసు, ఈఎస్ ఐ, ధన లక్ష్మీనగర్, అవిలాల, సిఎమ్.డీ ఆఫీసు, కేశవయనగుంట, శ్రీనివాస పురం, బైరాగిపట్టెడ, సాయి నగర్, రాఘవేంద్ర నగర్ , హథీరాంజీ కాలని, మంగళం రూరల్స్ పరిధి లో బి.టి.ఆర్.పురం, తిమ్మి నాయుడు పాలెం, డి. మార్ట్, గెస్ట్ లైన్, పద్మావతి నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు

నాణ్యమైన సేవలే లక్ష్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రతి వినియోగదారుడుకి నాణ్యతతో కూడిన వస్తు వినియోగ సేవలే తమ లక్ష్యంగా లీగల్ మెట్రాలజీ శాఖ పనిచేస్తుందని తిరుపతి లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్.స్వామి స్పష్టం చేశారు. ప్రపంచ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8వ తారీకు నుండి 20వ తేదీ వరకు లీగల్ మెట్రాలజీ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో పెట్రోల్ బంక్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మనబోలు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలు, వినియోగదారుల సేవలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కంట్రోలర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ వారోత్సవాలలో భాగంగా బియ్యం, బంగారం, పరిశ్రమలు, పెట్రోల్ ఇలా వివిధ రకాల ప్రజా వినియోగ విభాగాలకు సంబంధించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా వినియోగం లో ఏదేని వస్తువులకు సంబంధించి గాని సందేహాలు వస్తే తమ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4440 లేదా 1967కు డయల్ చేయాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పెట్రోల్ బంకు డీలర్లు శ్రీనివాసుల రెడ్డి, నాగ శేషసాయి, వెంకటేశ్వర్లు నాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కియా కారెన్స్ క్లావిస్ కారు ఆవిష్కరణ



ప్రజాశక్తి - రుపతి సిటీ : కియా కంపెనీ నూతనంగా రూపొందించిన కారెన్స్ క్లావిష్ కారును హెూషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కారు షోరూంలో శనివారం ఆవిష్కరించారు. స్థానిక 150 బైపాస్ రోడ్డులో, షోరూం వద్ద జరిగిన కార్యక్రమానికి ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథం రెడ్డి, డైరెక్టర్లు చెరుకు నిరంజన్, సి.భారతి, హెూషిమారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ ఇప్పుడు కియా నుండి విడుదలైన ఈ కొత్త కారెన్స్ క్లవిస్ కారు అత్యాధునిక సదుపాయాలతో అందిస్తున్నామన్నారు. బేస్ ప్రీమియం సౌండ్ సిస్టం విత్ 8 స్పీకర్స్, బెస్ట్ ఇన్ సెగ్మెంట్ 26.62 డ్యూయల్ పారనోమిక్ డిస్ప్లే పానల్, డ్యూయల్ పాన్ పొరనోమిక్ సన్ రూఫ్, వంటి సౌకర్యాలతో ఎనిమిది రంగులలో అందుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుకింగ్ కొరకు 8688829739 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

నూకతోటికి విషయ పరిజ్ఞానం లేదు..!

ప్రజాశక్తి - సత్యవేడు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వ పాలన ప్రజారంజకంగా సాగుతోందని సత్యవేడు తెదేపా పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీపతి బాబు పేర్కొన్నారు. శనివారం సత్యవేడులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, వైసిపి సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సత్యవేడు అభివృద్ధిపై మాట్లాడే నీవు గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూపగలవా అని ప్రశ్నించారు. వైసిపి హయాంలో రోజుకు 600 ట్రిప్పులకు పైగా మట్టిని అక్రమ రవాణా చేశారని దుయ్యబట్టారు. అప్పుడు మీకళ్ళకు దోపిడి కనపడలేదా..? అని ప్రశ్నించారు. విషయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడవద్దని హితవు పలికారు. సత్యవేడు అభివృద్ధి గురించి నియోజకవర్గంలో చర్చించడానికి ఎప్పుడైనా సిద్ధమని సవాల్ విసిరారు. డాక్టర్ శ్రీపతి బాబు మాట్లాడుతూ నూకతోటి రాజేష్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. వైసిపి ప్రభుత్వంలో చేసిన అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు.

అనుమతి లేని ట్రెక్కింగ్ నేరం

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: సహజ సిద్ధమైన తలకోన లాంటి అటవీ ప్రాంతంలో కొంత మంది యూట్యూబర్స్ అనుమతి లేకుండా ట్రెక్కింగ్ చేస్తున్నారని అలా చేయడం చట్టరీత్యా నేరమని భాకరాపేట అటవీ రేంజ్ ఆఫీసర్ వెంకట్రమణ శనివారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అడవులలో సంచరించే వన్య ప్రాణులు మనుగడ చాలా ముఖ్యమని తెలిపారు. అనుమతి లేకుండా వీడియోస్ తీయడం నిషేధమన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా అడవిలో ట్రెక్కింగ్ నిర్వహిస్తే వన్య ప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డాలర్స్ దివాకర్ రెడ్డిని సత్కరించిన శివప్రీతమ్



ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన డాలర్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ దివాకర్ రెడ్డిని శనివారం మాజీ చిత్తూరు ఎంపీ శివప్రసాద్ మనువడు, విఎం గ్రూప్ అధినేత కేతన్ శివప్రీతమ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో షణ్ముఖం పాల్గొన్నారు.

సత్యవేడులో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - సత్యవేడు : ఆపరేషన్ సిందూర్‌లో భారత దళాలు విజయవంతమైన నేపథ్యంలో దేశ సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం తిరుపతి జిల్లా సత్యవేడు మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి, కూటమి పార్టీ శ్రేణుల కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 1380 మంది హాజరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయని, ఈ రోజు జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1,380 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్.ఐ. ఓ జీ.వి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుమల పరిశుభ్రతకు ప్రతిజ్ఞ



ప్రజాశక్తి - తిరుమల: తిరుమల పరిశుభ్రత మనందరి బాధ్యతని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి అన్నారు. స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా శనివారం తిరుమలలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమల కార్యక్రమాన్ని స్థానిక బాలాజీ నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అదనపు ఈవో తిరుమల స్థానికులకు పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించి వారి చేత స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ లక్షలాదిమంది విచ్చేసే తిరుమల క్షేత్రంలో పరిశుభ్రత కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. స్థానికులు వ్యాపారం చేసే క్రమంలో స్వచ్ఛతకు తిలోదకాలు ఇవ్వకుండా భక్తులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలన్నారు. వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకుని భక్తులకు దుకాణాల వద్ద విరివిగా మంచినీరు అందించి పరోపకారం చేయాలన్నారు. స్థానికులు పరిసరాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. టీటీడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే స్థానికుల సహకారం అవసరమని తెలిపారు. స్థానికులు టీటీడీ మార్గదర్శకాలను పాటిస్తూ స్వచ్ఛ తిరుమలలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సోమన్ నారాయణ, సీపీఆర్వో డాక్టర్ టి.రవి, ఆరోగ్యాధికారి మధుసూదన్, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కళాకారులపై చిన్న చూపు తగదు



ఇంటి స్థలాలు కాపాడాలని నిరసన చేస్తున్న కళాకారులు

ప్రజాశక్తి - దొరవారిసత్రం : జానపద, వృత్తి కళాకారులకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలను కబ్జాదారులు అక్రమంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని వెంటనే జానపద వృత్తి కళాకారులకు ఇప్పించాలని తిరుపతి జిల్లా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద జానపద కళాకారులు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ దొరవారి సత్రం మండలంలోని అక్షర దీపం లాంటి అనేక సామాజిక కార్యక్రమాలలో జానపద కళాకారులు పాల్గొన్నందుకు ప్రోత్సాహం కింద సర్వే నెంబరు 44 సుమారు వందమంది పైగా ఉన్న కళాకారులకు ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించిందని తెలిపారు. కేటాయించిన స్థలంలో ఇళ్లు ఏర్పాటు చేసుకొని జీవనం సాగించారని తెలిపారు. వారు వృత్తిపరంగా జీవనోపాధి కోసం వెళ్లి వచ్చేసరికి కొంతమంది కబ్జాదారులు వారి ఇంటి స్థలాలు అక్రమంగా ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని పలుమార్లు అధికారుల దృష్టికి తెలియజేశామని పేర్కొన్నారు. జానపద కళాకారులకు కేటాయించిన స్థలాలను లేఅవుట్ ప్రకారం కేటాయించి, తోడ్పాటు అందించాలని తహసిల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారులు పాల్గొన్నారు.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-cum- IV ADJ: TIRUPATI

M.V.O.P. No. 134 / 2019

A. Sasi Rekha and others ..Petitioners
V/s
Mohammad Gouse and others
...Respondents

NOTICE TO THE RESPONDENT NO.4

R4) N. Nagaraja S/o N. Janakiram, D.No.23-11-203, SV Nagar, Tirupati

Please take notice that the petitioners have filed the above M.V.O.P. for compensation and the same is posted for your appearance. So, you are hereby called upon to appear before the Hon'ble Court on 09.06.2025 at 10:30 A.M., failing which the matter will be decided exparte.

Hearing Date: 09.06.2025

//by order of court//

GALI SREENIVASULU
Advocate for Petitioners, Tirupati